ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 22 .03.2024 సమయం: 13 .10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.
2. పునర్వినియోగ వాహక నౌక పుష్పక్ ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఈ ఉదయం విజయవంతంగా ప్రయోగించింది.
3. రాష్ట్రంలో మరో ఐదు లోక్ సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది.
4. రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష పత్రం లీక్ అయిందంటూ వివిధ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

.........................................................

**Kavitha-బెయిల్:**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ –(ఈడీ) అరెస్టు చేసిన బీఆర్ఎస్ MLC కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. అయితే ఆమె పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు పేర్కొంది. మనీలాండరింగ్ చట్టంలోని కొన్ని అంశాల రాజ్యాంగబద్ధతను, తనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ, కవిత దాఖలు చేసిన పిటిషన్ ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ M.M. సుందరేశ్, జస్టిస్ బేలా M. త్రివేది లతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ ఉదయం పరిశీలించింది. దీనిపై 6 వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. బెయిల్ అంశం మినహా, పిటిషన్ లో పేర్కొన్న మిగతా అంశాలను విచారణకు చేపడుతున్నట్లు పేర్కొంది. బెయిల్ విషయమై పిటిషనర్ ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచించింది, అలాగే బెయిల్ పిటిషన్‌పై జాప్యం

లేకుండా విచారణ జరపాలని కూడా ట్రయల్‌కోర్టును ఆదేశించింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు.

(MSL)

**పదో తరగతి పరీక్షలు -కమిషనర్**

రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష పత్రం లీక్ అయిందంటూ వివిధ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఈనెల 19వ తేదీన నిర్వహించిన ద్వితీయ భాషా పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అదే విధంగా 20వ తేదీన ప్రశ్నా పత్రం బయటకు వచ్చిందన్న ప్రచారం కూడా అవాస్తవమని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఈ సంఘటన పై చేసిన విచారణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని తేలింది. పదో తరగతి పరీక్షలు రాష్ట్రంలో సజావుగా జరుగుతున్నాయని, తగు భద్రత ఏర్పాట్లు కూడా చేశామని కమిషనర్ పేర్కొన్నారు.

(పీఎన్)

**కేజ్రీవాల్-కేటీఆర్**

మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఖండించారు. అరెస్టు అక్రమం అన్నారు. బీజేపీ చేతిలో అణచివేతకు ఈడీ, సీబీఐ ప్రధాన సాధనాలుగా మారాయని ఆరోపించారు. నిరాధారమైన ఆరోపణలతో రాజకీయ ప్రత్యర్థులను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ ప్రతీకారమే బీజేపీ ఏకైక లక్ష్యమని సామాజిక మాధ్యమం ఎక్స్ లో ట్వీట్ చేశారు.

(డెస్క్)

**BJP-కిషన్ రెడ్డి:**

BJP రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి G.కిషన్ రెడ్డి సికింద్రాబాద్ లోక్ సభ నియోజక వర్గం పరిధిలోని సనత్ నగర్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో బస్తీ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా, స్థానికులతో, ముఖ్యంగా వివిధ బస్తీల మహిళలు, పెద్దలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులతో ముచ్చటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేవినగర్, బ్రూక్ బాండ్ కాలనీ, పద్మనాభ రెసిడెన్సీ, న్యూ బోయిగూడ శాంతి టింబర్ డిపో ప్రాంతాలలో కిషన్ రెడ్డి పర్యటించారు.

(MSL)

**కాంగ్రెస్-లోక్ సభ**

రాష్ట్రంలో లోక్సభ ఎన్నికల్లో పోటీ చేసే తమ అభ్యర్థుల మూడో జాబితాను కాంగ్రెస్ పార్టీ నిన్న రాత్రి విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 57 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా తెలంగాణ నుంచి ఐదు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. దేశంలో అతిపెద్ద లోక్సభ నియోజకవర్గమైన మల్కాజ్ గిరి టికెట్ను పట్నం సునీతా మహేందర్రెడ్డికి కేటాయించింది. సికింద్రాబాద్ స్థానాన్ని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇచ్చింది. చేవెళ్ల అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ జి. రంజిత్రెడ్డికి కేటాయించింది. నాగర్కర్నూల్ అభ్యర్థిగా సీనియర్ నేత మల్లు రవి పేరును ఖరారు చేసింది. పెద్దపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ పేరును ప్రకటించింది. కాగా, ఈ ఐదుగురు అభ్యర్థుల్లో ముగ్గురు మూడు రోజుల క్రితం భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాలు ఉండగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు తొమ్మిది మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, భువనగిరి, మెదక్, హైదరాబాద్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థులను ప్రకటించవలసి ఉంది. బిజెపి ఇప్పటికే 15 లోక్సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా భారత రాష్ట్ర సమితి 11 నియోజకవర్గాల్లో తన అభ్యర్థులను ప్రకటించింది.

(ఎన్ఎస్డీ)

**సంగారెడ్డి-కలెక్టర్**

వేసవిలో సంగారెడ్డి జిల్లాలో తాగునీటి ఎద్దడిపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్లో ఆర్ డబ్ల్యూస్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 08455 276155 ఈ నెంబర్కు ఫోన్ చేస్తే వీలైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కరించలని ఆదేశించారు.

(పీటీసీ, సంగారెడ్డి)

**హైదరాబాద్ పోలీస్ కమిషనర్**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలో 144 సెక్షన్‌ను విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఆయుధ లైసెన్స్ కలిగిన వాళ్లు తమ ఆయుధాలను సంబంధిత పోలీస్టేషన్‌లలో స్వాధీనం చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ముగిసే వరకు కొత్త ఆయుధ లైసెన్స్ ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

(డెస్క్)

**సిరిసిల్ల-పరిశోధన**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన డాక్టర్ పత్తిపాక మోహన్ సాహిత్యం ఔత్సాహిక పరిశోధకులకు అంశంగా మారింది. నేషనల్ బుక్ ట్రస్టు ఉప సంపాదకుడిగా కొనసాగుతున్న మోహన్ బాలసాహిత్యం లో గతేడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. మోహన్ వెలువరించిన బాలసాహిత్యం, పరిశీలన అంశంపై జనగామకు

చెందిన యువ పరిశోధకుడు జవహర్లాల్ ప్రాచ్య, భాషా విభాగం డీన్ డాక్టర్ సిల్మానాయక్ పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో పరిశోధక విద్యా ర్థిని బాలగాయత్రి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొ ఫెసర్ సీతారాం పర్యవేక్షణలో పరిశోధన ప్రారంభించారు. సిరిసిల్లకు చెందిన మోహన్ సాహిత్యానికి పరిశోధన గౌరవం లభించడంపై మానేరు రచయితల సంఘం ప్రతినిధులు అభినందించారు.
(పీటీసీ, సిరిసిల్ల)

**కామారెడ్డి-నవోదయ విద్యార్థులు**

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ లోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిన్న రాత్రి తెలంగాణ, ఉత్తరప్రదేశ్(మై గ్రేషన్) విద్యార్థుల మధ్య ఘర్షణ నెలకొంది. ఉత్తరప్రదేశ్ విద్యార్థులు, స్థానిక విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇంట ర్మీడియట్ చదువుతున్న విద్యార్థికి గాయాలయ్యాయి. వీరిని వరించేందుకు ప్రయత్నించిన కొందరు ఉపాధ్యాయులకు సైతం స్వల్పంగా గాయాలయ్యాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ఎల్లారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.
(పీటీసీ, సిరిసిల్ల జిల్లా)

**నల్లగొండ-బీఆర్ఎస్**

నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, దీన్ని అరికట్టాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తిని కోరారు. తన నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలపై మోపిన కేసులను, వారిపై జరిగిన దాడులను ఎస్పీకి వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అగడాలు ఎక్కువయ్యాయని, బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. (పిటిసి, నల్లగొండ జిల్లా)

**ఖమ్మం-కలెక్టర్**

లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం జిల్లాలోని ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెంటర్లలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

(PTC, khammam)

**సిరిసిల్ల-పశు వైద్య అధికారి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గాలికుంట వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని జిల్లా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కొమురయ్య తెలిపారు. గాలికుంట వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి నివారణకు, ప్రతి పాడి రైతు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**జగిత్యాల-ఫ్లాగ్ మార్చ్**

జగిత్యాల జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని జగిత్యాల అడిషనల్ ఎస్పీ భీమ్ రావు కోరారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మెట్ పల్లి కేంద్రంలో జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతును నిర్వహించారు.

(జగిత్యాల, పీటీసీ)

**సిరిసిల్ల-బ్యాంకర్లు**

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అనుమానిత నగదు లావాదేవీలపై దృష్టి పెట్టాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపుకలె క్టర్ పూజారి గౌతమి బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్లో బ్యాంకుల కో ఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని బ్యాంకు అధికారులు తప్పనిసరిగా పాటించాలన్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**ఎనుమాముల-కోల్డ్ స్టోరేజీలు**

వరంగల్ ఎనుమాముల మార్కెట్ సమీపంలోని కోల్డ్ స్టోరేజీల వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. మిర్చి పంటను సరైన ధర లేకపోవడంతో వాటిని నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీల ఇవ్వకుండా కొందరు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పంట దళారీలు కోల్డ్ స్టోరేజీలను ఆక్రమించుకొని రైతులకు అన్యాయం చేస్తున్నారని నిరసన చేపట్టారు.

(వరంగల్ జిల్లా పి టి సి)

**KARNATAKA-ISRO:**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ పునర్వినియోగ వాహక నౌక పుష్పక్ న ఈరోజు ఉదయం విజయవంతంగా ప్రయోగించింది. కర్ణాటకలోని ATR చిత్రదుర్గాలో ఈ ప్రయోగం జరిగింది. ఈరోజు సామాజిక మాధ్యమంలో ఈ విషయాన్ని ప్రకటిస్తూ ఇస్రో చైర్మన్ ఎస్ ఎస్ సోమనాథ్ పుష్పక్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు అంతరిక్ష నౌకను పూర్తిగా స్వయంచాలిత పద్ధతిలో అత్యంత చాకచక్యంగా నడిపి సురక్షితంగా లాండింగ్ జరిపినందుకు ఇంధన నిర్వహణకు గాను వారికి శుభాకాంక్షలు తెలియజేశారు ఆర్ ఎల్ వి లాంచ్ వెహికల్ అంతరిక్ష నుంచి తిరిగి వచ్చేటప్పుడు అత్యంత వేగంతో భూమికి వచ్చినప్పుడు ఏ విధంగా ల్యాండ్ అయ్యేది simulation ద్వారా ఈరోజు విజయవంతంగా లాండింగ్ జరిపారని ఆయన పేర్కొన్నారు ఆర్ ఎల్ వి లెక్స్ 02 తో ఇస్రో దేశీయంగా అభివృద్ధి పరిచిన సాంకేతిక పరిజ్ఞానాలకు మరొకసారి విజయవంతంగా వాడుకలోకి తీసుకువస్తుంది. NSD